ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్ టౌన్, మార్చి 11: ఖానాపూర్ నుంచి ఆదివారం రాత్రి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. డ్రైవర్ పారిపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా ఫిర్యాదుల విభాగం

తానూర్, మార్చి 11: స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. ఈ విభాగంలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తహసీల్దార్ లింగమూర్తి తెలిపారు. ఈ ఫిర్యాదుల విభాగానికి ఇన్‌చార్జి మండల లాభివృద్ధి అధికారి మోహన్‌సింగ్, పశు వైద్యాధికారి గోపాల్ మహాజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, ఏపీఎం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ముథోల్, మార్చి 11: ముథోల్‌లోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి ఏర్పాటు చేశారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయాలని తహసీల్దార్ విఠల్ సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

భైంసా, మార్చి 11 : పట్టణంలోని జీపు అడ్డా సమీపం వద్ద కాసర్ల ప్రవీణ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం ప్రారంభించారు. ప్రవీణ్‌ను అభినందించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మల్లేశ్, మాణిక్, దిలీప్, డా. కుమార్ యాదవ్, తదితరులున్నారు.

సేవలు వినియోగించుకోండి

భైంసా, మార్చి 11: స్థానిక కృష్ణా మల్టీ స్పెషాలిటీ దవాఖానలో ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డా. అనిల్ కుమార్ జాదవ్ తెలిపారు. ఈఎస్ఐ అకౌంట్ ఉన్న కార్మికులకు ఉచితంగా ఓపీ చూస్తామని చెప్పారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్టీయూ నాయకులు

నిర్మల్ టన్, మార్చి 11: నిర్మల్ జిల్లా తెలంగాణ పీఆర్టీయూ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో పాటు డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా ట్రెజరీ అధికారి ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులను శాలువాతో సత్కరించి పూలబొకేను అందించారు. జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శి ఒడ్నాల రవిరాజ్, నాయకులు భోజన్న, శంకర్, తదితరులున్నారు.

ఉట్నూర్‌లో ఉద్యోగ మేళా

పెంబి, మార్చి 11: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో రేపు(బుధవారం) గిరిజన యువతీ యువకులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు ఒక ప్రకటలో తెలిపారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గిరిజన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు. బయోడేటా, విద్యార్హత పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకెళ్లాలని సూచించారు.

హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్. మార్చి 11: మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర ఆలయ శివరాత్రి హుండీని సోమవారం ఆలయం వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. కదిలి ఆలయ హుండీ ఆదాయం రూ. 4, 19, 924 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ తెలిపారు. అదే విధంగా కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని లెక్కించంగా రూ. 5, 30, 510 తో పాటు మిశ్రమ బంగారం 89 గ్రాములు, మిశ్రమ వెండి 1కిలో 420 గ్రాములు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు వెంకట్ రావు, పూజారం మహేశ్, ఆలయ డైరెక్టర్లు శేఖర్, నర్సయ్య, ఆలయ పండితులు శంకర్, పంచాక్షరి, సిద్ధు, శ్రీనివాస్, వెంకటేశ్వర్, రాము భక్తులు పాల్గొన్నారు. దిలావర్‌పూర్ ఎస్ఐ సుమాంజలి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

'విశ్వకర్మ యోజన'పై అవగాహన

నర్సాపూర్ జీ, మార్చి 11: మండలంలోని టెంబుర్నీ గ్రామంలో కలెక్టర్ ఆదేశానుసారం సమాచార పౌర సంబంధాల సరఫరాల శాఖ అధికారి విష్ణు వర్ధన్ విశ్వకర్మ యోజన పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు, మ్యాజిక్ షో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో తుల పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ సెక్రటరీ గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

దస్తురాబాద్, మార్చి 11: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గృహజ్యోతి దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి అధికారులు స్వీకరించారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు ప్రజా పాలన రసీదు, కరెంట్ బిల్లు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ సిలిండర్ బుక్ జిరాక్స్ తీసుకవచ్చి, కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నాణ్యతపై పట్టింపేది..?

■ నాసిరకంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై సత్తనపల్లి గ్రామస్తుల మండిపాటు

ఖానాపూర్ రూరల్, మార్చి 11: ప్రజలకు సౌకర్యంగా ఉండాల్సిన సీసీ రోడ్లు, నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారని గ్రామస్తులు దామెర శ్రీనివాస్, అల్లి మల్లేశ్, అల్లి రమేశ్, బేర స్వామి ఆరోపించారు. ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామంలో రూ. 5 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపట్టారు. 20 ఎంఎం రాయితో నిర్మించాల్సిన సీసీ రోడ్లు 40 ఎంఎం రాయితో నిర్వహిస్తున్నారని కాంట్రాక్టర్, అధికారులపై గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకంతో నిర్మించిన డ్రైనేజీలకు క్యూరింగ్ లేకపోవడం, డ్రైనేజీల్లో వేయాల్సిన సీసీ బెడ్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. కొలత పరిమాణంలో సిమెంట్‌ను వినియోగించాల్సి ఉండగా, ఇసుక, కాంక్రీట్‌ను ఎక్కువగా పోస్తున్నరన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు నిర్వహిస్తున్నాడని మండిపడ్డారు. ఈవిషయమై పీఆర్ జేఈ అన్వర్‌ను వివరణ కోరగా, నాణ్యతతో పనులు చేయకుంటే బిల్లులు నిలిపివేస్తామని చెప్పారు. పూర్తి క్వాలిటీతో పనులు చేస్తేనే బిల్లుల వస్తాయని తెలిపారు.

నాసిరకంతో నిర్మించిన రోడ్లను చూపిస్తున్న గ్రామస్తులు

నీటి ఎద్దడి లేకుండా చూడండి

■ అధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశం
■ తాగు, సాగు నీరు, రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్ష
■ ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

నిర్మల్ టౌన్, మార్చి 11: నిర్మల్ జిల్లాలో వేసవికాలం దృష్టిలో ఉంచుకొని నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లాలో తాగు, సాగు నీరు నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో భూగర్భజలాలు సంరక్షించుకునేందుకు ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. వేసవి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందే గుర్తించి మిషన్ భగీరథ ద్వారా నీటిని అందించే విధంగా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి లీకేజీలను అరికట్టాలని మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా భూగర్భజలశాఖ ఆధ్వర్యంలో నీటి పొదుపుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అధికారి శ్రీనివాస్‌బాబును ఆదేశించారు. యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని సుశీల్‌కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్ష...

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రంజాన్ పండగను పురస్కరించుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి రంజాన్ పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని తాగునీరు సక్రమంగా అందే విధంగా చూసుకోవాలని ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శంకరయ్య, ఎజాజ్‌అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దు

అర్జీల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయవద్దని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీల్లో ఎక్కువగా డబుల్‌బెడ్రూం ఇండ్లు, పెన్షన్లకు సంబంధించినవి ఎక్కువగా వస్తున్నాయని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. 47 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగయ్య, తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

■ దిలావర్‌పూర్ ఎంపీపీ అక్షర ■ దిలావర్‌పూర్, చిట్యాల్ గ్రామాల్లో మహిళా దినోత్సవం

దిలావర్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

దిలావర్‌పూర్ మార్చి 11: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దిలావర్‌పూర్ ఎంపీపీ అక్షర అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ఎంపీపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో అరుణారాణి, ఎస్ఐ సుమాంజలి, ఏపీవో దివ్యారెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచనారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పుష్ప, పంచాయతీ కార్యదర్శులు స్వాతి, మేఘన, దివ్య, ప్రీతి, కంప్యూటర్ ఆపరేటర్ విజయలక్ష్మి, ఎంపీవో అజీజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.
సోన్, మార్చి 11: నిర్మల్ మండలం చిట్యాల్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయినిలను శాలువాతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు జీ నర్సయ్య, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పోతన్న, వహీద్, రాజేశ్వరి, దీవెన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బాండ్లను బహిర్గతం చేయాలి

బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

నిర్మల్ టౌన్, మార్చి 11: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ చైర్మన్ బహిర్గతం చేయాలని సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. సోమవారం జిల్లా ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల వ్యవస్థను రాజ్యాంగ విలువలను కాపాడడంలో, మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బాండ్ల విషయంలో సమగ్ర విచారణ జరిపి, చైర్మన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూతన్‌కుమార్, గౌతంకృష్ణ, తిరుపతి, సురేశ్, ఫసియొద్దీన్, గంగాధర్, సాయికిరణ్, మసీద్, అబ్బాస్ పాల్గొన్నారు.

చదువుకుంటూ ముందుకు సాగాలి

భైంసా, మార్చి, 11: ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ ముందుకుసాగాలని ప్రముఖ కవి జాదవ్ పుండలిక్ రావు అన్నారు. పట్టణంలోని శ్రీ మేధా హైస్కూల్‌లో జరిగిన పదో తరగతి వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. డైరెక్టర్ ప్రేమానంద్, కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు సాయినాథ్, అకాడమిక్ డైరెక్టర్ సందీప్, తదితరులున్నారు.

ఎల్ ఈడీ బల్బుల అందజేత

నర్సాపూర్ జీ, మార్చి 11: మండలంలోని తిమ్మాపూర్ జీ గ్రామానికి చెందిన డా రాజేందర్ దత్తాత్రేయ మందిరానికి వెళ్లే దారిలో 15 ఎల్ఈడీ వీధి దీపాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ వినోద్ రెడ్డి, శ్రీనివాస్, నగేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

■ కుభీర్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడి

ఆలయం ఎదుట భక్తులు

కుభీర్, మార్చి 11: మండలంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో కొనసాగుతున్న వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి వేలాది మంది భక్తులు కొత్త ధాన్యాలతో చేసిన జొన్న అంబలిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్మల్ జిల్లా నుంచే కాకుం డా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఎంపీపీ తూం లక్ష్మి, భైంసా మాజీ మున్సిపల్ చైర్మన్ భాజనోల్ల గంగాధర చైర్మెన్ మోహన్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూం రాజేశ్వర్, నిర్మల్ జిల్లా నుండే కాకుండా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శివ పార్వతుల కల్యాణం

మండలంలోని పార్డి(కె) గ్రామంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంజీవ్ మహారా జ్ ఆలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం వేదమం త్రోచ్ఛారణల మధ్య కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షు డు బందెల శంకర్, పోశెట్టి, బాబు, దొంతుల సీను, హన్మాండ్లు, పాల్గొన్నారు.

యాసంగిలో సాగు తగ్గిపాయె..

■ బీడు భూములుగా వ్యవసాయ క్షేత్రాలు ■ గతేడాది కంటే 3 వేల ఎకరాల్లో వరి తగ్గుదల ■ మక్కసాగుపై కూడా నిరాసక్తి

దస్తురాబాద్‌లో బీడు భూములుగా దర్శనమిస్తున్న పంట పొలాలు

బోర్ కింద సాగు చేసిన వరి పంట

దస్తురాబాద్,మార్చి3 : ఈ ఏడాది సరైన వర్షాలు లేక చెరువుల్లో సరిపడా నీరు చేరలేదు. కడెం ప్రాజెక్ట్ మరమ్మతుల కారణంగా అధికారులు నీరు విడుదల చేయలేదు. ప్రస్తుతం కడెం ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. మండల రైతులు అధిక శాతం కడెం ప్రాజెక్ట్ ఆయకట్టుపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. కానీ ఈ యాసంగిలో మాత్రం కడెం ప్రాజెక్ట్ కింద, చెరువుల కింద పంటలు పండించే భూములు, పొలాలు ఎక్కడ చూసినా చాలా వరకు బీడుగా దర్శనమిస్తున్నాయి. ఇక యాసంగిలో వరి సాగుకు చెరువుల్లో, ప్రాజెక్ట్ నుంచి నీరు అందని పరిస్థితి ఏర్పడడంతో అధిక శాతం రైతులు బోర్ బావులపైనే ఆధారపడి రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. గత యాసంగిలో దస్తురాబాద్, రేవోజీపేట క్లస్టర్ల పరిధిలో 8900 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. కాగా ఈసారి కేవలం 5900 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు.

గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం..

యాసంగి సాగు విస్తీర్ణం గతేడాదితో పోల్చితే ఈ సారి గణనీయంగా తగ్గింది. కారణాలు ఏమైనా, రైతు బంధు డబ్బులు అందకపోవడం, వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడం, కడెం ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేయకపోవడం, చెరువుల్లో నీరు లేక పోవడం,తదితర కారణాలతో యాసంగి సాగు తగ్గింది. అదేవిధంగా గతేడాది 90 ఎకరాల్లో మక్క పంటను రైతులు సాగు చేయగా, ఈ సారి కేవలం 56 ఎకరాల్లో 13 మంది రైతులు మాత్రమే మక్కను సాగు చేశారు. అలాగే 80 ఎకరాల్లో 30 మంది రైతులు నువ్వు పంట, 75 ఎకరాల్లో 40 మంది రైతులు పెసర పంటను సాగు చేశారు. తాజాగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల సర్వే అంచనాల ప్రకారం ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

వాలీబాల్ టోర్నమెంట్

తానూర్, మార్చి11: మండలంలోని బోరిగాం గ్రామంలోని ప్రభుత్వ క్రీడా ప్రాంగణంలో సోమవారం బ్లాక్‌లెవల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఎన్‌వైకేఎస్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకేఎస్ కో ఆర్డినేటర్ బంక కిరణ్ మాట్లాడుతూ బోరిగాం, బాసర మండల యువకులు వాలీబాల్ టోర్నమెంట్‌లో పోటీ పడగా బోరిగాం గ్రామానికి చెందిన రామ్‌సేన యూత్ జట్టు విజేతగా నిలిచినట్లు తెలిపారు. విజేతలకు మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ ఎన్‌వైకేఎస్ సర్టిఫికెట్లు, వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బోరిగాం, బాసర మండల యువకులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఖానాపూర్ రూరల్, మార్చి 11: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవా లని ఖానాపూర్ ఎంఈవో మధుసూదన్ సూచించారు. మస్కాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను సోమవారం పరిశీలించారు. పాఠ శాలలో విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలంటే భయం వద్దని, ధృఢ సంకల్పంతో రాయాలని చెప్పారు. పదో తరగతి పాస్ అయితేనే జీవితంలో మెరుగైన స్థితిలో ముందుకు సాగుతారని తెలిపారు. అనంతరం పట్టణంలోని విద్యానగర్ పాఠశాలను పరిశీలించారు. హెచ్‌ఎం సునితారాణి, జ్యోత్స్నాదేవి, ఉపాధ్యాయినిలు ఉన్నారు.

13న భీమన్న జాతర

బోథ్, మార్చి 11 : మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో ఈనెల 13వ తేదీన భీమన్న జాతర నిర్వహిస్తున్నట్లు పూజారులు అగ్గు కిష్టయ్య, అగ్గు స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన గంగస్నానానికి వెళ్లడం జరిగిందని తెలిపారు. మండలంతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకొని పండుగను విజయవంతం చేయాలని కోరారు.

కుష్ఠు సర్వే చేయం..: ఆశ కార్యకర్తలు


అధికారులతో మాట్లాడుతున్న ఆశ వర్కర్లు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 11 : 'గతేడాది చేసిన సర్వే డబ్బులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఆశ కార్యకర్తలు సోమవారం కుష్ఠు సర్వేను నిలిపి వేశారు. అధికారులు సర్వే చేయాలని ఒత్తిడి చేయడంతో జిల్లా వైద్యాధికారులతో మాట్లాడారు. గతంలో కూడా మార్చిలో కుష్ఠు సర్వే చేశామని, ఇప్పటికీ కూడా రెమ్యునరేషన్ డబ్బులు రాలేదని ఆవేదన చెందారు. చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.గంగామణి, చంద్రకళ, ఉపాధ్యక్షులు భాగ్యలక్ష్మి, జిల్లా కోశాధికారి రామలక్ష్మి, నాయకులు శ్యామల, శ్రీలత, గంగలక్ష్మి, కవిత, సుజాత, కమల, సునీత, రాజమణి, లావణ్య పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

సోన్, మార్చి 11: పట్టణంలోని నాయిడివాడకు చెందిన సురేశ్‌కు ఐదేళ్ల జైలుతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ సోమవారం అసిస్టెంట్ సెషన్ జడ్జి అజేష్‌కుమార్ తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వాయాధికారి సక్రినాయక్ తెలిపారు. 2022లో మహాలక్ష్మీవాడలో నివాసముంటున్న గొజ్జ సునీత, కుటుంబసభ్యులపై సురేశ్ ప్లాట్ విషయంలో గొడవ పడి హత్యాయత్నం చేసినట్లు తెలిపారు. బాధితురాలు అప్పటి ఎస్ఐ యాసిర్ అరాఫత్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటివరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు 14 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, సోమవారం కేసు రుజువు కావడంతో ఐదేళ్ల కఠినకారాగార శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఇంటి పన్ను చెల్లించాలి

దస్తురాబాద్, మార్చి 11: ఇంటి పన్నును సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులు సూచించారు. మండలంలోని దేవునిగూడెం, మున్యాల, తదితర గ్రామాల్లో పంచాయతీ అధికారులు సోమవారం ఇంటింటికీ వెళ్లి, పన్నులు సేకరించారు. పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రాజేశ్వరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

513 మంది గైర్హాజరు

నిర్మల్ అర్బన్, మార్చి 11: నిర్మల్ జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 513 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా నోడల్ అధికారి పరుశురాం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7072 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, ఇందులో 6559 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

కుంటాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

దిలావర్‌పూర్, మార్చి 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం డీఈసీ సభ్యులు జాదవ్ పరుశురాం పరిశీలించారు. పరీక్షల తీరును పరిశీలించారు. దిలావర్‌పూర్‌లో 223 మంది విద్యార్థులకు 209 మంది హాజరైనట్లు తెలిపారు. సభ్యులు వెంకటేశ్వర్లు, జాదవ్ రవికిరణ్, పరీక్షల నిర్వహణ అధికారి కే శంకర్, డిపార్టుమెంట్ అధికారి లక్ష్మీకాంత్ తదితరులున్నారు.
కుంటాల, మార్చి 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం జిల్లా నోడల్ అధికారి పురుశురాం పరిశీలించారు. వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, డీఈసీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవి కిరణ్ తదితరులున్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మతపెద్దలతో మాట్లాడుతున్న సీఐ మల్లేశ్

ముథోల్, మార్చి, 11: రంజాన్ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ మల్లేశ్ సూచించారు. ముథోల్‌లోని సర్కిల్ కార్యాలయంలో మైనార్టీ పెద్దలతో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి ప్రారంభం కానున్న రంజాన్‌కు పోలీసులు పూర్తి సహకారం అందిస్తామన్నారు. పెద్దలు కూడా తమకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ సాయికిరణ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎజాజొద్దీన్ , తదితరులున్నారు.

మోదీనే ప్రధాని కావడం ఖాయం

భైంసా, మార్చి 11: మూడో సారి మోదీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సోమవారం లబర్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో అసెంబ్లీ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ లబ్ధిదారులను కలుస్తూ సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మండల కమిటీలుగా ఎన్నికైన బాధ్యులను సన్మానించారు. లబర్థి సంపర్క్ అభియాన్ పార్లమెంట్ కన్వీనర్ గాలి రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ బీ. గంగాధర్, సోలంకి భీంరావు, సాంవ్లీ రమేశ్ పండిత్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి, భైంసా పట్టణాధ్యక్షుడు మల్లేశ్, మండలాల నాయకులు తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడెం: పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

సోన్, మార్చి 11: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 15లక్షలతో సీసీ రోడ్డు పనులు, మురుగు కాలువల పనులను వైస్ ఎంపీపీ నాగయ్యా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేపీ నాయకులు అంకం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి భూపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గడ్డం స్వామి, జంగం రాజేశ్వర్, పోశెట్టి, సురేందర్, తదితరులున్నారు.

ముజ్గిలో..

నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలోని రూ. 5లక్షలతో సీసీ రోడ్డు పనులను సోమవారం నాయకులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌లు మల్లేశ్, ఎంబరి గంగాధర్, అడెపు నర్సయ్య, ఎంపీటీసీ సభ్యులు సంతోష్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం నారాయణరెడ్డి, వార్డు సభ్యులు కే నర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కడెంలో..

కడెం, మార్చి 11: మండలకేంద్రంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ అంథోని అలెగ్జాండర్, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండలకేంద్రంలోని పలు వార్డుల్లో మిగిలిపోయిన సీసీ రోడ్లను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునురుల్ హసన్, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ముద్దం ప్రశాంత్, నాయకులు వాజీద్, తదితరులున్నారు.